APBIL/26/A4072.

గోదావరి భవిష్యత్

# వార్త

గోదావరి స్పెషల్ బులిటెన్

తెలుగు దినపత్రిక

సంపుటి : 1 సంచిక : 128 సెప్టెంబర్ 27 ఆదివారం 2026 పేజీలు : 8 వెల : 5 రూ.

## లుధియానాలో ఘోర ప్రమాదం.. ఆరు వాహనాలను ఢీకొట్టిన టియాగో ఈవీ..

లుధియానా: పంజాబ్‌లోని లుధియానాలో ఘోర రోడ్డు ప్రమాదం కలకలం రేపింది. బహదూర్‌కే రోడ్డుపై వేగంగా దూసుకొచ్చిన టాటా టియాగో ఈవీ అదుపుతప్పి వరుసగా ఆరు వాహనాలను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఐదుగురు గాయపడగా.. వారిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు స్థానిక సీసీటీవీ కెమెరాలో రికార్డయ్యాయి. బహదూర్‌కే రోడ్డుపై వాహనాల రాకపోకలు సాధారణంగానే కొనసాగుతున్నాయి. అయితే, ఓ టాటా టియాగో ఈవీ అత్యంత వేగంతో దూసుకొచ్చి ఎదురుగా వస్తున్న సైకిల్, మోటార్‌సైకిల్ సహా పలు వాహనాలను ఢీకొట్టింది. కారు బలంగా ఢీకొనడంతో మోటార్‌సైకిల్‌పై ఉన్న వ్యక్తి గాల్లోకి ఎగిరి పలుమార్లు పల్టీలు కొట్టాడు. అనంతరం రోడ్డుపై సుమారు 30 అడుగుల దూరంలో పడిపోయాడు. అలాగే ముందుకు దూసుకెళ్లిన కారు.. మరో రెండు ఈ-రిక్షాలు, ఓ యాక్టివా స్కూటర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మొత్తం ఆరు వాహనాలు దెబ్బతిన్నాయి. ఐదుగురు తీవ్రంగా గాయపడగా.. బాధితులను ఆస్పత్రికి తరలించారు. అయితే, తమ వాహనాలను ఢీకొన్న సమయంలో కారు గంటకు సుమారు 100 నుంచి 120 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తోందని బాధితులు తెలిపారు. అంతేకాకుండా డ్రైవర్ మద్యం సేవించి ఉండొచ్చని అనుమానాలు వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న వెంటనే సలీం టాబ్రీ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రమాదంపై దర్యాప్తు ప్రారంభించి కారు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

## 2027 గోదావరి పుష్కరాలే లక్ష్యంగా 'ది గోదావరి కాల్స్' ప్రచారం: మంత్రి దుర్గేష్

రాజమండ్రి : రాజమండ్రిలోని మంజీరా హోటల్‌లో ఆదివారం ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నామని మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. మీడియాతో మాట్లాడుతూ.. ఏపీ టూరిజంలో ఏఐ టెక్నాలజీ కొత్త శకానికి వేదికవుతుందని అన్నారు. 130కి పైగా ప్రాంతాల్లో ఏఐ-ఎనేబుల్డ్ 'నివు' క్యూఆర్ కోడ్స్ ఆవిష్కరణ చేసి.. 130 భాషల్లో మాట్లాడే ఏఐ డిజిటల్ గైడ్‌ను రూపొందించామని తెలిపారు. 2027 గోదావరి పుష్కరాలే లక్ష్యంగా 'ది గోదావరి కాల్స్' ప్రచారానికి శ్రీకారం చుట్టామని వెల్లడించారు. సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు, క్రియేటర్లతో ఏపీ టూరిజంపై ప్రత్యేక ప్రచారం నిర్వహిస్తామని చెప్పారు. గోదావరి పుష్కరాలు ద్వారా ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలు పర్యాటక రంగంగా అభివృద్ధి చెందుతాయని మంత్రి స్పష్టం చేశారు. రాష్ట్ర స్థాయి వేడుకలకు పర్యాటక రంగానికి చెందిన ప్రముఖులు, టూర్ ఆపరేటర్లు, ఆతిథ్య రంగ ప్రతినిధులు, కంటెంట్ క్రియేటర్లు, టెక్నాలజీ ఇన్నోవేటర్లు హాజరవుతారని తెలిపారు. గోదావరి ప్రాంతంలో క్యూరేటెడ్ ఫామిలియా రైజేషన్ ట్రిప్స్ కోసం విశాఖపట్నం నుంచి హాప్-ఆన్ హాప్-ఆఫ్ డబుల్ డెక్కర్ బస్సులను రాజమండ్రికి తీసుకువస్తున్నామని తెలిపారు.

## మోడీ 'భజన'మంత్రం పనిచేస్తుందా ?!



ఢిల్లీ, ముంబయి, బెంగళూరు, కోల్ కత, అహ్మదాబాద్ నుండి అమెరికా వరకు వేగంగా వ్యాపిస్తున్న 'భజన్ క్లబ్బింగ్స్' ఇప్పుడు ట్రెండింగ్ గా మారింది. సాంప్రదాయ భక్తి గీతాలు, భజనలు, కీర్తనలకు ఆధునిక లైవ్ బ్యాండ్స్, లైటింగ్, కళ్లుచెదిరే వేదికలు, ఎలక్ట్రానిక్ బీట్స్ జోడించడం ఈ భజన్ క్లబ్బింగ్ ప్రత్యేకత. న్యూఢిల్లీలోని దీన్‌దయాళ్ ఉపాధ్యాయ్ పార్క్ లో నిర్వహించిన దీన్‌దయాళ్ ఉపాధ్యాయ్ 110వ జయంతి సందర్భంగా స్వయంగా ప్రధాని నరేంద్ర మోడీ కంజర వాయిస్తూ పాల్గొన్నారు. అనంతరం 130వ మన్ కీ బాత్ ఎపిసోడ్‌లో ప్రధాని మోడీ దీన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. 'మన దేశంలో భజనలు, కీర్తనలు శతాబ్దాలుగా సంస్కృతికి ఆత్మ. ఈరోజు యువత భక్తిని తమ జీవనశైలిలోకి తీసుకొచ్చింది. ఆధునిక యువతను ఆకట్టుకునే విధంగా ఇది ఉంది. భజనల గౌరవం, పవిత్రత కాపాడబడుతోంది. ఆధ్యాత్మికత, ఆధునికత అందంగా కలుస్తున్నాయి' అని మన్ కీ బాత్ లో ప్రధాని నరేంద్ర మోడీ ప్రస్తావించారు. అయితే భజన్ క్లబ్బింగ్స్ లో స్వయంగా మోడీ పాల్గొనడం మీద విమర్శలు వచ్చాయి. యువతను నిరుద్యోగం, ఇతర సమస్యల నుండి మళ్లించేందుకు వీటిని ఉపయోగిస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. సీజేపీ అధ్యక్షుడు అభిజిత్ దీప్కే మోడీ భజన వీడియో, ఢిల్లీలో మైనర్ బాలిక మీద జరిగిన గ్యాంగ్ రేప్ సంఘటనను ప్రస్తావిస్తూ మోడీ ప్రాధాన్యత దేనికి సోషల్ మీడియాలో విమర్శలు చేశారు. ఈ భజన్ క్లబ్బింగ్స్ యువతకు సోషల్ కనెక్షన్స్, కమ్యూనిటీ ఫీలింగ్ తో పాటు మానసిక వత్తిడి తగ్గించడం, మద్యం, డ్రగ్స్ లేని అనుభవాలను పంచుతాయి. దాంతో పాటు సాంస్కృతిక మూలాలతో అనుసంధానం కల్పించడంతో పాటు ఆధ్యాత్మిక శాంతిని అందిస్తాయి. అయితే అదే సమయంలో నిరుద్యోగం, విద్యా వ్యవస్థలో లోపాలు, ఉపాధి అవకాశాలు, మహిళా భద్రత వంటి నిజమైన సమస్యలను పరిష్కారం కాదని అంటున్నారు.

## వైసీపీకి షాక్ ఇచ్చిన యనమల



వైసీపీకి కాకినాడ జిల్లాలో షాకుల మీద షాకులు తగులుతున్నాయి. ప్రత్తిపాడు నియోజకవర్గం నుంచి మూడు సార్లు గెలిచిన పరుపుల సుబ్బారావు కీలక నేతలను వెంటబెట్టుకుని వైసీపీ గేటు దాటేశారు. ఆయన జనసేన అధినేత పవన్ కళ్యాణ్ సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఇపుడు అదే జిల్లాలో మరో ముఖ్య నేత ఫ్యాన్ నీడ నుంచి బయటకు వచ్చేశారు. ఆయన ఎవరో కాదు రాజకీయంగా ప్రముఖ నేతగా ఉన్న మాజీ మంత్రి యనమల రామక్రిష్ణుడు తమ్ముడు యనమల కృష్ణుడు. ఆయన వైసీపీకి రాజీనామా చేసి మంగళగిరి జనసేన కేంద్ర కార్యాలయంలో పవన్ సమక్షంలో కండువా కప్పుకున్నారు. యనమల కృష్ణుడు 2024 ఎన్నికల్లో టీడీపీ టికెట్ ఆశించారు. అయితే అది యనమల రామక్రిష్ణుడు కుమ్మర్తె దివ్యకు ఖరారు కావడంతో ఆయన వైసీపీలో అప్పట్లో చేరారు. అయితే వైసీపీ ఓటమి పాలు అయింది. ఇక నియోజకవర్గంలో కూడా ఆయనకు మాజీ మంత్రి తుని వైసీపీ ఇంచార్జి దాడిశెట్టి రాజాకు మధ్య విభేదాలు చోటు చేసుకోవడం జరిగింది. ఇలా ఒకే పార్టీలో రెండు వర్గాలుగా ఉంటూ వచ్చిన తీరుతో తునిలో పార్టీ ఇబ్బందులో పడుతోంది. ఇపుడు యనమల క్రిష్ణుడు జనసేన దారి చూసుకున్నారు. ఆయనతో పాటు మాజీ ఎంపీపీ మాజీ పోల్నాటి శేషగిరిరావు, తొండంగి మండలానికి చెందిన పలువురు నాయకులు జనసేనలో చేరారు. తునిలో కాపులతో పాటు యాదవులు కూడా బలంగా ఉంటారు. ఈ రెండు సామాజిక వర్గాలతో పాటు బీసీలు ప్రముఖ పాత్ర పోషిస్తారు. అలా యనమల రామక్రిష్ణుడు బలమైన నేతగా ఉన్నారు. బీసీ వర్గానికి చెందిన ఆయన వైసీపీని వీడడం అంటే పార్టీకి నష్టమే అని అంటున్నారు. అయితే తునిలో టికెట్ ని ఆశిస్తున్న క్రిష్ణుడుకు వైసీపీలో ఆ చాన్స్ లేదని అర్థం అవుతోంది. అయినా కానీ పార్టీలో సముచిత స్థానం కూడా దక్కడం లేదని భావించే బయటకు వచ్చారు అని అంటున్నారు. వైసీపీకి 2024 ఎన్నికల్లో గోదావరి జిల్లాలలో చేదు ఫలితాలు వచ్చాయి. అప్పటి నుంచి పార్టీ కోలుకోవడానికి చేస్తున్న ప్రయత్నాలు ఒక కొలిక్కి రావడం లేదు, మరో వైపు టీడీపీ జనసేన బలంగా ఉన్నాయి. ఈ రెండు పార్టీలనే నాయకులు అంతా ఎంచుకుంటున్నారు. జనసేన అంటే ఒక సామాజిక వర్గం వారే అక్కడ ఎక్కువగా చేరుతున్నారు అన్న భావన తప్పు అనిపించేలా బీసీ నేతగా ఉన్న యనమల క్రిష్ణుడు గాజు గ్లాస్ పట్టుకోవడం రాజకీయంగా సామాజిక సమీకరణల పరంగా కలసి వచ్చే అవకాశం ఉంది అని అంటున్నారు. మరో వైపు వైసీపీని కూటమి పార్టీలు గట్టిగా టార్గెట్ చేస్తున్నాయి. ఇప్పటికే నియోజకవర్గం స్థాయి నాయకులు అంతా ఒక్కొక్కరుగా జారుకుంటున్నారు. రానున్న రోజులలో ద్వితీయ తృతీయ శ్రేణి నేతలు కూడా ఫ్యాన్ పార్టీని వీడి బయటకు వస్తారని అంటున్నారు. వైసీపీ కూడా ఈ పరిణామాలను చేష్టలుడిగి చూస్తోంది అన్న విమర్శలు అదే పార్టీ నుంచి ఉన్నాయి అంటున్నారు.

## ఉగ్రవాదాన్ని ఆపకపోతే పరిణామాలు తప్పవు'.. పాక్‌కు భారత్ హెచ్చరిక

ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశం వేదికగా భారత్, పాకిస్థాన్ మధ్య మాటల యుద్ధం జరిగింది. పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ప్రసంగంలో కశ్మీర్ సహా 2025లో భారత్-పాక్ ఘర్షణ, సింధు జలాల ఒప్పందం తదితర అంశాలను ప్రస్తావించారు. బదులుగా భారత్ తన 'రైట్ టు రిప్లై' ద్వారా దీటుగా స్పందించింది. పాక్ ఉగ్రవాదానికి మద్దతిస్తోందని ఆరోపిస్తూనే.. ఆ పరిస్థితులు అలాగే కొనసాగిస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించింది.




## సంఘ సంస్కరణలపై దృష్టి పెట్టండి



న్యూఢిల్లీ ఓటు బ్యాంకు రాజకీయాలపైన కాకుండా సంఘ సంస్క రణలు, సమాజంలో సానుకూల మార్పు లపై దృష్టి పెట్టాలని బీజేపీ కార్యకర్తలకు ప్రధాని నరేంద్ర మోదీ సూచించారు. గత 12 ఏళ్లుగా దేశంలోని పట్టణాలు, పల్లెల మధ్య అంతరం చాలా తగ్గిపోయిందని అన్నారు. పల్లెల్లో మౌలిక సదుపాయాలు భారీ ఎత్తున మెరుగయ్యాయని తెలిపారు. దేశ మహిళల్లో స్వావలంభన గణనీయంగా పెరిగిందన్నారు. వారాణసి, వాద్‌నగర్ మధ్య నిర్వహి స్తున్న సేవా యాత్రలో పాల్గొంటున్న వారిని ఉద్దేశించి ప్రధాని మోదీ శుక్రవారం వర్చువల్‌గా మాట్లాడారు. మహాత్మాగాంధీ స్వాతంత్ర్య సమరయోధుడు మాత్రమే కాదని, ఆయన ఓ సంఘ సంస్కర్త అని కొనియాడారు. సమాజంలో పాతుకుపోయిన చెడుపై కూడా ఆయన పోరాడారని గుర్తుచేశారు. ఆ పోరాటానికి కొనసాగింపుగా రాజకీయ పార్టీల కార్యకర్తలు, నేతలుగా మనం కూడా సంఘ సంస్కరణపై దృష్టి పెట్టాలన్నారు. సమాజానికి సేవ చేసిన వారికి గౌరవం దక్కాలి అని చెప్పారు. ఈ సందర్భంగా ప్రయాగ్‌రాజ్‌లో కుంభమేళా సంద ర్భంగా స్వచ్ఛ కార్యక్రమాలు చేపట్టిన వారి సేవలను కొనియా డారు. వారివల్లే కుంభమేళా ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందిందని, భారత్‌పై గౌరవం ఇనుమడించిందని చెప్పారు. అందుకే వారి కాళ్లు కడిగి ఆశీర్వాదాలు తీసుకోవాలని కోరుకున్నాను అని వెల్లడించారు.

## వరదల వేళ చంద్రబాబు కీలక ఆదేశం.. మత్స్యకార కుటుంబాలకు 50 కేజీల బియ్యం




అమరావతి : రాష్ట్రంలో భారీ వర్షాలు, ఉత్తరాంధ్రలో వరద పరిస్థితులపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శనివారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. పలు జిల్లాల్లో నివాస ప్రాంతాలు జలమయం కావడం, పంటల మునకపై సీఎస్ సాయిప్రసాద్ సహా ఉన్నతాధికారులతో సమీక్షించారు. ముంపునకు గురైన ప్రాంతాల్లో పునరావాస చర్యలను ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు. గత 5 రోజులుగా సముద్రంపై వేటకు వెళ్ల లేకపోయిన మత్స్యకార కుటుంబాలకు ఉచితంగా 50 కేజీల బియ్యం ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారు. ఉత్తరాంధ్రలో నదీ ప్రవాహాలు, ముంపు పరిస్థితిని సీఎం దృష్టికి మంత్రి అచ్చెన్నాయుడు తీసుకొచ్చారు. ఆయా జిల్లాల్లోని రిజర్వాయర్లలో నీటి ప్రవాహాలను ఇరిగేషన్ అధికారులు వివరించారు. హీర మండలం లిఫ్ట్ ప్రాజెక్టుకు విద్యుత్ సౌకర్యం కల్పించే ప్రక్రియను వేగవంతం చేయాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఆదేశించారు. ఇరిగేషన్, విద్యుత్ శాఖల ఉన్నతాధికారులు తక్షణం ఈ ప్రక్రియ పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. లిఫ్ట్ పనులు పూర్తి చేసి వంశధార నీటిని హీర మండలం రిజర్వాయర్లోకి తరలించాలని సూచించారు. పలు జిల్లాల్లో రిజర్వాయర్లను నింపేందుకు తీసుకున్న చర్యలపై అధికారులతో సీఎం మాట్లాడారు. కృష్ణానదిలో పైనుంచి ప్రవాహాలు లేవని, స్థానికంగా వస్తున్న వరదతో ప్రకాశం బ్యారేజ్ వద్ద నీళ్లు పెరిగాయని అధికారులు తెలియజేశారు. స్థానికంగా వస్తున్న వరదను పూర్తి స్థాయిలో నిల్వచేసుకునేందుకు పులిచింతల దిగువన, ప్రకాశం బ్యారేజ్‌కు ఎగువన బ్యారేజ్ నిర్మాణం అవసరమని సీఎం తెలిపారు. ప్రకాశం బ్యారేజీకి ఎగువన, దిగువన రెండు బ్యారేజ్‌లు కట్టేందుకు గతంలో చేసిన ప్రతిపాదనలను ముందుకు తీసుకువెళ్లాలని సూచించారు. ఈ రెండు ప్రాజెక్టుల నిర్మాణంపై కేంద్రానికి ప్రతిపాదనలు పంపాలని సీఎం తెలిపారు. తాజా వర్షాలతో వర్షపాతం లోటు 50 నుంచి 31 శాతానికి తగ్గిందని అధికారులు వివరించారు. కోస్తాంధ్రలో 19.80 శాతం లోటు ఉండగా, రాయలసీమలో 42 శాతం లోటు ఉన్నట్లు తెలిపారు. ప్రస్తుతం వర్షాలు పూర్తిగా తగ్గాయని, ఉత్తరాంధ్రలో ఎగువ ప్రాంతాల నుంచి నదుల్లోకి ప్రవాహాలు కొనసాగుతున్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబుకు అధికారులు వివరించారు.

## ఇరాన్‌పై గెలుపు.. మహిళల కబడ్డీలో భారత్‌కు స్వర్ణం




భారత మహిళల కబడ్డీ జట్టు అద్భుత ప్రదర్శన కనబర్చింది. ఉత్కంఠభరితంగా సాగిన ఫైనల్లో ఇరాన్‌ను 37-34తో ఓడించి ఈ ఆసియా క్రీడల్లో భారత్‌కు మూడో పసిడిని అందించింది. కీలక సమయంలో ఒత్తిడిని అధిగమిస్తూ.. చివరి వరకు పోరాట పటిమను ప్రదర్శించిన భారత అమ్మాయిలు చిరస్మరణీయ విజయం సాధించారు. భారత్-ఇరాన్ మధ్య ఫైనల్ పోరు ఆరంభం నుంచే హోరాహోరీగా సాగింది. పాయింట్ల కోసం ఇరు జట్లు తీవ్రంగా పోటీపడ్డాయి. పలుమార్లు ఇరాన్ ఆధిక్యంలోకి వెళ్లడంతో భారత శిబిరంలో ఉత్కంఠ నెలకొంది. ఒకానొక దశలో ఇరాన్ మ్యాచ్‌ను తమ వైపు తిప్పుకునేలా కూడా కనిపించింది. అయితే.. భారత క్రీడాకారిణులు ఒత్తిడిని జయిస్తూ సమష్టిగా పోరాడారు. కీలక సమయాల్లో ఒక్కో పాయింట్ సాధిస్తూ ఆధిక్యంలోకి దూసుకెళ్లారు. అదే సమయంలో.. మ్యాచ్ ముగింపు దశలో అవతలి టీమ్ చేసిన కొన్ని పొరపాట్లు కూడా భారత్‌కు కలిసొచ్చాయి. ముఖ్యంగా ప్రత్యర్థి రైడర్లిద్దరూ ఒకేసారి కోర్టులోకి ప్రవేశించడం అవతలి టీమ్‌కు ప్రతికూలంగా మారింది. చివరి విజిల్ మోగే సమయానికి స్కోరు 37-34తో భారత్ వైపు నిలిచింది. దీంతో ఈ సీజన్లో మూడో స్వర్ణం భారత్ ఖాతాలో చేరింది.

## సింగూరులో డేంజర్ బెల్స్



జోగిపేట(సంగారెడ్డి): ఉమ్మడి రాష్ట్రంలో హైదరాబాద్ మహానగర ప్రజలకు తాగునీటిని సరఫరా చేయడమే లక్ష్యంగా మంజీరా నదిపై సింగూరు ప్రాజెక్టును ప్రతిపాదించారు. నిర్మాణ పనులను 1979లో ప్రారంభించి 1989 నాటికి పూర్తిచేశారు. ఈ ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 29.917 టీఎంసీలు. ప్రతి రోజూ జంట నగరాల దాహార్తి తీర్చడంతో పాటు అందోలు నియోజకవర్గంలో పంటల సాగు కోసం ప్రత్యేకంగా 2 టీఎంసీల నీటిని కేటాయించారు. గత ప్రభుత్వ ఆధ్వర్యంలో చేపట్టిన మిషన్ భగీరథ పథకం ద్వారా అందోలు నియోజకవర్గంతోపాటు సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాలకు తాగునీటిని సరఫరా చేస్తున్నారు. మొత్తం 1,666 గ్రామపంచాయతీలు, 21 మున్సిపాలిటీలతో పాటు హైదరాబాద్ మహానగర ప్రజలకు తాగు నీటి అవసరాల కోసం ప్రతి రోజూ 292 క్యూసెక్కుల నీటిని ప్రాజెక్టు నుంచి తరలిస్తారు. దశాబ్దాల తరబడి మరమ్మతులకు నోచుకోకపోవడంతో ప్రాజెక్టు కట్ట, గేట్ల వద్ద పగుళ్లు వచ్చాయని డ్యామ్ సేఫ్టీ అధికారులు ప్రభుత్వానికి నివేదిక అందజేశారు. వారి సూచన మేరకు ప్రభుత్వం ప్రాజెక్టు మరమ్మతులకు పూనుకుంది. ఇందుకోసం జలాశయంలో నీటి నిల్వను కనీస స్థాయికి తగ్గించారు. 4.010 టీఎంసీలు నిల్వ ఉంచి మిగిలిన నీటిని విడతలవారీగా మంజీరా నదిలోకి వదిలేశారు. నిల్వ ఉంచిన 4 టీఎంసీల్లో ప్రతిరోజూ 292 క్యూసెక్కులు తాగునీటి కోసం తోడేయటంతో ప్రాజెక్టు వేగంగా ఎండిపోతున్నది. ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు తెలెత్తడంతో ప్రాజెక్టుకు వరద రాలేదు. ఎగువన ఉన్న కర్ణాటక, మహారాష్ట్రల నుంచి చుక్క నీరు కూడా చేరలేదు. దీంతో ప్రాజెక్టులో నేడు మిగిలింది కేవలం 4.010 టీఎంసీలు మాత్రమే. ప్రస్తుతమున్న నీటి నిల్వల ప్రకారం ప్రతి రోజూ తాగునీటి అవసరాల కోసం 292 క్యూసెక్కులు పంపింగ్ చేస్తుండటంతోపాటు నీటి ఆవిరి కలుపుకుని ప్రతి రోజూ 350 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టు తరలిస్తున్నరు. ప్రస్తుతం ఉన్న నాలుగు టీఎంసీల నీటి న్విలు మరో నాలుగు నెలలపాటు సరిపోతాయని ప్రాజెక్టు అధికారులు పేర్కొన్నారు. భవిష్యత్తులో ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిస్తే తప్ప ప్రాజెక్టులోకి కొత్త నీరు వచ్చే అవకాశాలు లేవు. దీంతో ప్రాజెక్టు సంక్షోభ స్థాయికి చేరుకుంది. ఈ నేపథ్యంలో వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై అధికారులు దృష్టిసారించారు.

ఈ క్రమంలో అందోలు-జోగిపేట మునన్సిపాలిటీలలో చైర్మన్, కమిషనర్, కౌన్సిలర్లు కలిసి గతంలో ఉపయోగించిన ప్రత్యామ్నాయాలను పునరుద్ధరించేందుకు సమీక్ష జరిపారు. మరోవైపు ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు పడే అవకాశం లేకపోవడంతో తాగునీటి ఎద్దడి మరింత తీవ్రమయ్యే ప్రమాదం ఉంది. నియోజకవర్గ పరిధిలోని 2 టీఎంసీల సాగునీటితో పాటు మిషన్ భగీరథ ద్వారా సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాలకు తాగునీటిని అందించే ఈ బహుళార్థసాధక ప్రాజెక్టులో నీళ్లు లేకపోవడంతో సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది.

కట్ట, డ్యామ్ మరమ్మతుల నేపథ్యంలో డ్యామ్ సేఫ్టీ అధికారుల సూచన మేరకు సింగూరు ప్రాజెక్టులోని నీటి నిల్వను 4.700 టీఎంసీలకు తగ్గించాము. ప్రస్తుతమున్న 4.010 టీఎంసీల నీటి నిల్వలు మరో నాలుగు నెలలు సరిపోతాయి. ఈ లోపు ఎగువ ప్రాంతం నుంచి వరద వచ్చినా, ఈప్రాంతంలో అతి భారీ వర్షాలు పడ్డా.. డ్యామ్‌లో కొత్త నీరు చేరుతుంది. లేకపోతే మాత్రం సాగు నీరు అటుంచి తాగునీటికి ఇబ్బందే..

## 'సర్' వివాదంపై ఎన్నికల సంఘం వివరణ ఇవ్వాలి




ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై కొనసాగుతున్న వివాదం నేపథ్యంలో అధికార కూటమిలోని మూడు మిత్రపక్షాలు స్పందించాయి. 'సర్' వివాదంపై ఎన్నికల సంఘం నుంచి స్పష్టమైన వివరణ కోరాయి. ఈ అంశంపై ఎన్నికల సంఘం తన వైఖరిని స్పష్టంగా వెల్లడించాలని లోక్ జనశక్తి పార్టీ (రామ్ విలాస్) అధినేత, కేంద్ర మంత్రి చిరాగ్ పాస్వాన్, రాష్ట్రీయ లోక్ మోర్చా అధినేత ఉపేంద్ర కుష్వాహా, తెలుగుదేశం పార్టీ ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు కోరారు ఎన్నికల సంఘం వివరణ ఇవ్వాల్సింది ప్రతిపక్షాలను సంతృప్తి పరిచేందుకు కాదని, ప్రజల్లో ఎన్నికల ప్రక్రియపై నమ్మకాన్ని కొనసాగించేందుకేనని ఈ నేతలు పేర్కొన్నారు. ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణపై వివిధ వర్గాల నుంచి ప్రశ్నలు, అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో ఎన్నికల సంఘం స్పష్టత ఇవ్వడం అవసరమని వారు అభిప్రాయపడ్డారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు అనుమానాలు కలిగే పరిస్థితి ఏర్పడటం సరికాదని కేంద్ర మంత్రి చిరాగ్ పాస్వాన్ అన్నారు ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై లేవనెత్తిన అనుమానాలను ప్రతిపక్షాలు నిరూపించలేకపోయాయని తెలుగుదేశం పార్టీ ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు అన్నారు ఎన్నికల సంఘం రాజ్యాంగబద్ధ సంస్థగా ప్రజాస్వామ్య పరిరక్షణలో కీలక బాధ్యతను నిర్వహిస్తోందని, ప్రస్తుతం లేవనెత్తుతున్న ప్రశ్నలపై ఎన్నికల సంఘం వివరణ ఇస్తే ప్రజల్లో విశ్వాసం మరింత బలపడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఇక, ఓటర్ల జాబితాల సవరణ, ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలకు సంబంధించిన అంశాలపై ప్రజల్లో గందరగోళం నెలకొందని, దానిని నివృత్తి చేయాల్సిన అవసరం ఉందని రాజ్యసభ సభ్యుడు ఉపేంద్ర కుష్వాహా అన్నారు.

## భారత్ నుంచి చైనా దాకా 4000కి.మీ. మేఘమాల

న్యూఢిల్లీ : భారత ఉపఖండంలోని పలు రాష్ట్రాల నుంచి.. బంగ్లాదేశ్, మయన్మార్ మీదుగా చైనా దాకా.. 4000 కిలోమీటర్ల మేర విస్తరించిన మేఘమాల తాలూకూ ఉపగ్రహ ఛాయాచిత్రమిది! బంగాళాఖాతంలో ఏర్పడ్డ తీవ్ర వాయుగుండం ఏపీ తీరాన్ని తాకుతున్న సమయంలో భారత వాతావరణ శాఖ విడుదల చేసిన తాజా ఉపగ్రహ ఛాయాచిత్రాల్లో ఇది కనిపించింది. నైరుతి రుతుపవనాలు నిష్క్రమణ దశలోకి ప్రవేశిస్తున్న సమయంలో బంగాళాఖాతంలో ఏర్పడిన వాతావరణ మార్పుల వల్ల విస్తారంగా తేమ చేరి ఈ మేఘమాల ఏర్పడినట్టు వాతావరణ నిపుణులు వెల్లడించారు. ఈ మేఘాల వరుస విస్తరించిన ప్రాంతాల్లో (తూర్పు, ఈశాన్య భారత రాష్ట్రాలతోపాటు.. బంగ్లాదేశ్, మయన్మార్, చైనాల్లో) పలుచోట్ల ఉరుములతో కూడిన భారీ వర్షాలు, తుఫాన్లు వచ్చే అవకాశం ఉందని వారు వివరించారు.



# ప్రమాదపుటంచున కాకినాడ వారధులు:

**అధికారుల నిర్లక్ష్యంపై 'ది ఫోరం ఫర్ బెటర్ కాకినాడ అధ్యక్షులు,' ఆగ్రహం**



కాకినాడ సిటీ సెప్టెంబర్ 26 జి ఎస్ బి వార్త : స్మార్ట్ సిటీ కాకినాడలోని ప్రధాన వంతెనల నిర్వహణపై సంబంధిత అధికారులు తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారని 'ది ఫోరం ఫర్ బెటర్ కాకినాడ' ప్రతినిధి, జెన్‌కో విశ్రాంత ఈఈ కొలగాని వి.వి.ఎస్. మూర్తి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నగరంలో నిత్యం వేలాది మంది రాకపోకలు సాగించే జగన్నాథపురం, టూ టౌన్, ఇంద్రపాలెం ఫ్లైఓవర్లు శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. నగరంలోకి ప్రవేశించే కీలకమైన జగన్నాథపురం వారధితో పాటు పలు వంతెనల పగుళ్లలో పిచ్చిమొక్కలు మొలచి, వాటి వేర్లు లోపలికి చొచ్చుకుపోవడంతో కాంక్రీట్ నెర్రలు చాచిందని పేర్కొన్నారు. రక్షణగా ఉండాల్సిన హ్యాండ్‌రైల్స్ విరిగిపోయాయని, ఉక్కు భాగాలు తుప్పుపట్టి పూర్తిగా బలహీనపడ్డాయని తెలిపారు. సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో వర్షపు నీరు నిలిచిపోయి వంతెనల మనుగడకే పెనుముప్పుగా మారిందని హెచ్చరించారు. ప్రజా సమస్యలపై తక్షణమే స్పందించాలని సీఎం నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆదేశిస్తున్నప్పటికీ.. క్షేత్రస్థాయిలో ఆర్ అండ్ బీ, మున్సిపల్ అధికారులు మొద్దునిద్ర వీడటం లేదని ఆయన విమర్శించారు. ప్రమాదకరంగా మారిన రెయిలింగ్స్‌పై రాజకీయ పర్యటనల పేరిట పాదచారుల నడకదారిని ఆక్రమించి భారీ ఫ్లెక్సీలు, బ్యానర్లు కడుతున్నారని, బలమైన ఈదురుగాలులు వీచినప్పుడు ఇవి ఊడిపడి ప్రాణనష్టం జరిగే ప్రమాదముందని ఆక్షేపించారు. ఏదైనా విపత్తు జరిగి ప్రాణనష్టం సంభవించకముందే ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన పలు డిమాండ్లను తెరపైకి తెచ్చారు: నగరంలోని అన్ని వంతెనలకు తక్షణమే సమగ్ర నిర్మాణ భద్రతా పరిశీలన (స్ట్రక్చరల్ సేఫ్టీ ఆడిట్) నిర్వహించాలి. యుద్ధప్రాతిపదికన వంతెనలపై పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించి, విరిగిన హ్యాండ్‌రైల్స్‌ను పునరుద్ధరించాలి. వంతెనల రెయిలింగ్స్‌పై అడ్డగోలుగా ఫ్లెక్సీలు, బ్యానర్లు కట్టడంపై పూర్తి నిషేధం విధించాలి. వర్షపు నీరు సాఫీగా వెళ్లేలా డ్రైనేజీ మరమ్మతులు చేపట్టి, వంతెనలకు శాశ్వత రక్షణ చర్యలు చేపట్టాలి. నగర వారధుల దుస్థితిపై సమగ్ర వివరాలతో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసినట్లు ఆయన వెల్లడించారు. అధికారులు ఇకనైనా స్పందించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరారు.

# కాకినాడ జిల్లాలో ఎస్‌జీఎఫ్ఐ క్రీడా పోటీలు



కాకినాడ, (జిఎస్ బి వార్త ): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్.జీ.ఎఫ్.ఐ) ఆధ్వర్యంలో కాకినాడ జిల్లాలో వివిధ క్రీడాంశాలకు సంబంధించి అండర్–14, అండర్–17, అండర్–19 విభాగాల బాలబాలికల పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సెప్టెంబర్ 28న తైక్వాండో, గట్కా పోటీలు కాకినాడ డీఎస్ఏ గ్రౌండ్స్‌లో, జూడో పోటీలు వాకలపూడి జెడ్పీ హైస్కూల్‌లో, టేబుల్ టెన్నిస్ పోటీలు రాజమహేంద్రవరం టౌన్ హాల్‌లో నిర్వహించనున్నారు. బాక్సింగ్ పోటీలు పిఠాపురంలోని ఆర్ఆర్‌బీజీ హైస్కూల్‌లో జరగనున్నాయి. సెప్టెంబర్ 30న రగ్బీ, ఫుట్‌బాల్, వుషు, వెయిట్‌లిఫ్టింగ్, టెన్నిస్, థాంగ్–టా తదితర క్రీడాంశాల పోటీలు నిర్వహించనున్నారు. వీటిలో సంబంధిత పోటీలు కాకినాడ డీఎస్ఏ గ్రౌండ్స్‌లో, అథ్లెటిక్స్ పోటీలు రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో జరగనున్నాయి. అక్టోబర్ 1న రెజ్లింగ్, రగ్బీ, క్రికెట్ పోటీలు నిర్వహించనున్నారు. రెజ్లింగ్ పోటీలు అండర్–14, అండర్–17 బాలబాలికలకు, రగ్బీ పోటీలు అండర్–14, అండర్–17 బాలికలకు నిర్వహించనున్నారు. అండర్–17 బాలికల క్రికెట్ పోటీలు అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో జరగనున్నాయి. అక్టోబర్ 3న అండర్–17 బాలబాలికల ఫుట్‌బాల్, అండర్–14, అండర్–17 బాలబాలికలు మరియు అండర్–19 బాలబాలికల మల్లఖంబ్, అండర్–14 బాలబాలికల హ్యాండ్‌బాల్ పోటీలు కాకినాడ డీఎస్ఏ గ్రౌండ్స్‌లో నిర్వహించనున్నారు. ఈ క్రీడా పోటీలను విజయవంతంగా నిర్వహించేందుకు సంబంధిత ఎస్ఏ–పిఈ లు, పిఈ ఉపాధ్యాయులు, పాఠశాలల సిబ్బంది మరియు నిర్వాహకులు సమన్వయంతో పనిచేయాలని అధికారులు సూచించారు. విద్యార్థులు క్రీడా స్ఫూర్తితో పోటీల్లో పాల్గొని ప్రతిభను చాటుకోవాలని ఆర్గనైజింగ్ సెక్రటరీ పి. శ్రీనివాస్, పిడి పి.వి.ఎస్.ఎస్ కుమారి ఓ ప్రకటనలో తెలిపారు.

# చలో విజయవాడ'కు వెళ్తే చర్యలు తప్పవు

**కాకినాడ ఎస్పీ బిందు మాధవ్ హెచ్చరిక**



కాకినాడ సిటీ సెప్టెంబర్ 26 జి ఎస్ బి వార్త : స్వర్ణ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సెప్టెంబరు 27న తలపెట్టిన 'చలో విజయవాడ' కార్యక్రమానికి జిల్లా నుంచి ఎవరూ వెళ్లరాదని కాకినాడ జిల్లా ఎస్పీ జి. బిందుమాధవ్ హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించి బయలుదేరితే చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయం శనివారం ఒక ప్రకటన విడుదల చేసింది. ప్రస్తుతం జిల్లాలోని పలు ప్రాంతాల్లో వరద పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో పోలీసు యంత్రాంగం సహాయక చర్యలు, ముంపు ప్రాంతాల ప్రజల తరలింపు, పునరావాస ఏర్పాట్లలో నిమగ్నమై ఉందని ఎస్పీ తెలిపారు. ప్రజల భద్రతే లక్ష్యంగా యంత్రాంగం నిరంతరం పనిచేస్తున్న తరుణంలో ఇలాంటి ఆందోళన కార్యక్రమాలకు వెళ్లడం భావ్యం కాదన్నారు. పోలీస్, రెవెన్యూ, విపత్తు నిర్వహణ శాఖల సహాయక చర్యలకు అందరూ సహకరించాలని కోరారు. పోలీసుల ఆదేశాలు ధిక్కరించి నిరసనలకు వెళ్లినా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా కఠిన చర్యలతో పాటు అరెస్టులు తప్పవని హెచ్చరించారు. పరిస్థితులను అర్థం చేసుకుని ఉద్యోగులు, ప్రజలు పోలీసులకు సహకరించాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

# వైభవంగా శ్రీసత్యదేవుని ప్రాకారసేవ.

అన్నవరం,(జి ఎస్ బి వార్త),సెప్టెంబర్ – 26 : కాకినాడ జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివారి సన్నిధిలో శనివారం సందర్భంగా శ్రీ సత్యదేవుడు, అమ్మవారు తిరుచ్చివాహనంపై ఆలయ ప్రాకారం చుట్టూ వైభవంగా ఊరేగారు. ఉదయం ఆలయ అర్చకులు శ్రీస్వామి,అమ్మవార్ల ఉత్సవ మూర్తులను వివిధ రకాల సుగంధభరిత పుష్పములతో అలంకరించి తిరుచ్చి వాహనంపై ఆశీనులు గావించారు. వేదపండితుల మంత్రోచ్ఛరణ, మంగళ వాయిద్యాల నడుమ ఆలయ ప్రాకారం చుట్టూ ముమ్మార్లు ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆలయ ఏఈఓ భాస్కర్ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తుల నడుమ ప్రాకార సేవ ఆద్యంతం వైభవంగా సాగింది. కార్యక్రమంలో ఆలయ అర్చకులు కంచిభట్ల రాంకుమార్,వేధపండితులు,దేవస్థానం అధికారులు,సిబ్బంది,వ్రత పురోహితులు,భక్తులు,గ్రామస్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# పెద్దాపురం ఆర్డీవో ఇంట్లో భారీ చోరీ కేసు ఛేదన

**నిందితుడి అరెస్ట్, రూ.15 లక్షల నగదు, బంగారం స్వాధీనం**



కాకినాడ సిటీ సెప్టెంబర్ 26 జి ఎస్ బి వార్త : పెద్దాపురం ఆర్డీవో నివాసంలో జరిగిన భారీ చోరీ కేసును పోలీసులు ఛేదించారు. నిందితుడిని అరెస్ట్ చేసి, అతని వద్ద నుంచి రూ.15 లక్షల నగదుతో పాటు 105.4 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ వివరాలను జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ శనివారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం, గత జూలై 25న అర్ధరాత్రి పెద్దాపురం రామారావు పేటలోని డీఎల్పీవో కార్యాలయం ఎదురుగా ఉన్న ఆర్డీవో నివాసంలో చోరీ జరిగింది. ఇంటి వెనుక భాగంలోని మెష్ డోర్ తెరిచి లోపలికి ప్రవేశించిన నిందితుడు, కప్‌బోర్డులోని తాళం చెవితో ఇనుప అల్మారాను తెరిచాడు. అందులోని సుమారు రూ.30 లక్షల విలువైన 276 గ్రాముల బంగారం, 48 గ్రాముల వెండి, రూ.75 వేల నగదును అపహరించాడు. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి దర్యాప్తు చేపట్టారు. వడ్లమూరు గ్రామ శివారులోని పెట్రోల్ బంక్ వద్ద సంచరిస్తుండగా అడ్డతీగల మండలం కొత్తపాలెం గ్రామానికి చెందిన మామిడి శివ కుమార్ అలియాస్ శివను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి రూ.15 లక్షల నగదు, 105.4 గ్రాముల బంగారాన్ని రికవరీ చేశారు. క్లిష్టమైన ఈ కేసును చాకచక్యంగా ఛేదించిన అదనపు ఎస్పీ డాక్టర్ మహంతి కిషోర్ కుమార్, ఎస్డీపీవో ఏబీజీ తిలక్, సీఐ వైఆర్కే శ్రీనివాస్, సీసీఎస్ సీఐ ఆర్. అంకబాబు, ఐటీ కోర్ సీఐ దుర్గా శేఖర్ రెడ్డి, ఎస్సై యు. పాపారావు, ఇతర సిబ్బందిని ఎస్పీ బిందు మాధవ్ అభినందించి రివార్డులు ప్రకటించారు.

# జెడ్పీ ప్రత్యేక అధికారిగా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ బాధ్యతల స్వీకరణ



కాకినాడ సిటీ సెప్టెంబర్ 26 జి ఎస్ బి వార్త : నూతనంగా ఏర్పడిన కాకినాడ జిల్లా ప్రజా పరిషత్తు ప్రత్యేక అధికారిగా జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ శనివారం కలెక్టరేట్‌లో బాధ్యతలు స్వీకరించారు. సెప్టెంబర్ 25 నుంచి కాకినాడ జిల్లా ప్రజా పరిషత్తు అమలులోకి రావడంతో, దీనికి ఆయన తొలి ప్రత్యేక అధికారిగా వ్యవహరించనున్నారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం జిల్లా కలెక్టర్‌ను జెడ్పీ సీఈవో లక్ష్మణరావు, డిప్యూటీ సీఈవో శ్రీలలిత మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి సత్కరించారు. అనంతరం ఆయనకు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ పరిపాలనాధికారులు (ఏవోలు) ఎం. బుజ్జిబాబు, మూర్తితో పాటు వివిధ విభాగాల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# పోలీసులు ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టాలి

**మంత్రి వాసంశెట్టి సుభాష్ - ఘనంగా 280 మంది కానిస్టేబుళ్ల దీక్షాంత పరేడ్**




కాకినాడ సిటీ సెప్టెంబర్ 26 జి ఎస్ బి వార్త : పోలీసు ఉద్యోగం కేవలం ఉపాధి మాత్రమే కాదని, సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజల ప్రాణాలు, ఆస్తులను కాపాడే గురుతర బాధ్యతని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ స్పష్టం చేశారు. ప్రతి పోలీసు సిబ్బంది నిజాయితీ, క్రమశిక్షణ, సేవా భావంతో పనిచేసి ప్రజల విశ్వాసాన్ని చూరగొనాలని పిలుపునిచ్చారు. కాకినాడలోని ఆంధ్రప్రదేశ్ స్పెషల్ పోలీస్ (APSP) 3వ బెటాలియన్‌లో 2025–26 బ్యాచ్ రెండో బేసిక్ ట్రైనింగ్ పోలీస్ కానిస్టేబుల్ (రాజ్యూజ) దీక్షాంత పరేడ్ శనివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి సుభాష్ గౌరవ వందనం స్వీకరించారు. తొమ్మిది నెలల కఠిన శిక్షణను పూర్తి చేసుకున్న 280 మంది కానిస్టేబుళ్లకు ఆయన అభినందనలు తెలిపారు. కానిస్టేబుల్‌గా ప్రస్థానం ప్రారంభించి డిప్యూటీ కమాండెంట్‌గా ఎదిగిన వానసెట్టి సుబ్బారావు కృషిని మంత్రి ఈ సందర్భంగా కొనియాడారు. కార్యక్రమంలో 3వ బెటాలియన్ కమాండెంట్ కె.ఎన్. కుమార్ మాట్లాడుతూ, విధి నిర్వహణలో పారదర్శకత, బాధ్యతాయుత సేవా దృక్పథం ముఖ్యమని, పోలీసు శాఖ ప్రతిష్టను పెంచేలా నూతన కానిస్టేబుళ్లు పనిచేయాలని సూచించారు. అనంతరం శిక్షణలో ప్రతిభ కనబరిచిన క్యాడెట్లకు బహుమతులు అందజేశారు. పోలీసు బ్యాండ్, విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో కాకినాడ జిల్లా ఎస్పీ బిందు మాధవ్ గరికపాటి, ఎమ్మెల్సీలు పేరావత్తుల రాజశేఖర్, కర్రీ పద్మజ, కాకినాడ రూరల్ టీడీపీ ఇన్చార్జి పిల్లి అనంతలక్ష్మి, డిప్యూటీ కమాండెంట్లు, శిక్షణ పూర్తి చేసుకున్న కానిస్టేబుళ్ల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# బొడ్డు విష్ణుమూర్తి మరణం పార్టీకి తీరని లోటు

**మంత్రి సుభాష్**



కాజులూరు, (జి ఎస్ బి వార్త )సెప్టెంబర్ 26: కాజులూరు మండల పరిషత్ మాజీ అధ్యక్షులు, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు బొడ్డు విష్ణుమూర్తి అకాల మరణం పార్టీకి, కాజులూరు మండల ప్రజలకు తీరని లోటని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. శనివారం ఆర్యవటం గ్రామంలోని విష్ణుమూర్తి స్వగృహానికి వెళ్లిన మంత్రి సుభాష్, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ బొడ్డు విష్ణుమూర్తి ప్రజలతో మమేకమై పనిచేసిన నాయకుడని, పార్టీ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేసిన అంకితభావం కలిగిన కార్యకర్త అని కొనియాడారు. మండల పరిషత్ అధ్యక్షుడిగా ప్రజా సమస్యల పరిష్కారానికి విశేషంగా సేవలందించారని గుర్తు చేశారు.పార్టీ బలోపేతం కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని, నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేస్తూ అందరి అభిమానాన్ని సంపాదించుకున్నారని మంత్రి తెలిపారు. విష్ణుమూర్తి మరణంతో పార్టీ ఒక అనుభవజ్ఞుడైన నాయకుడిని కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. విష్ణుమూర్తి కుటుంబ సభ్యులకు పార్టీ అండగా ఉంటుందని, వారి కుటుంబానికి అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు కృషి చేస్తామని మంత్రి భరోసా ఇచ్చారు. భగవంతుడు ఆయన ఆత్మకు శాంతి చేకూర్చాలని, కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని ప్రసాదించాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో ద్వారంపూడి సత్యనారాయణ రెడ్డి, గుత్తుల బుల్లిరాజు, కొల్లి హనుమంతరావు , చందాల మల్లిబాబు, చందాల ఆదినారాయణ కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# రత్నగిరిపై వనదుర్గమ్మ ఆలయంలో 'పౌర్ణమి' సందర్భంగా ఘనంగా "ప్రత్యంగిరా హోమం"




అన్నవరం, (జి ఎస్ బి వార్త),సెప్టెంబర్ –26 : కాకినాడ జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరం శ్రీ వీరవేంకట సత్యనారాయణ స్వామివారి రత్నగిరిపై శనివారం "బాద్రపద పౌర్ణమి" పురస్కరించుకుని, రత్నగిరి క్షేత్ర రక్షకురాలైన వనదుర్గమ్మ ఆలయంలో ప్రత్యంగిరా హోమం ఘనంగా నిర్వహించారు.ప్రజలను దుష్ట శక్తులు,శత్రువుల భాధల నుండి రక్షించి,సకల కార్యముల యందు విజయం చేకూర్చుడానికి నిర్వహించే ప్రత్యంగిరా దేవతా హోమాన్ని లోక శ్రేయస్సు, సర్వజనహితం కొరకు ఋత్విక బృందం ఆద్వర్యంలో ఘనంగా ప్రత్యంగిరా హోమం నిర్వహించారు. ముందుగా విఘ్నేశ్వర పూజ నిర్వహించి ప్రత్యంగిరా దేవతలను ఆవాహనం చేసారు.వేద మంత్రోచ్చరణ నడుమ ప్రత్యంగిర హోమాన్ని ప్రారంభించారు.మండపారాధన, కళశస్థాపన, జపములు, తర్పణములు అనంతరం వేద మంత్రోఛ్చారణ,మంగళ వాయిద్యాల నడుమ పవిత్ర హోమ ద్రవ్యాలను షోడశోపచార పూజలు నిర్వహించి, హోమగుండంలో సమర్పించి,ప్రత్యంగిర హోమానికి పూర్ణాహుతి గావించారు.పూజా కార్యక్రమాలను అర్చకులు మరియు వేద పండితులు,వైదిక బృందం ఆద్వర్యంలో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో , ఆలయ వైధిక సిబ్బంది, అధికారులు,సిబ్బంది,భక్తులు,గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# టిడ్కో ఇళ్లలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

**ఎమ్మెల్యే వనమాడి కొండబాబు**



కాకినాడ సిటీ సెప్టెంబర్ 26 జి ఎస్ బి వార్త : కాకినాడ పరిధిలోని టిడ్కో గృహ సముదాయాల్లో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రత్యేకంగా వాటర్ స్టోరేజీ ట్యాంక్ నిర్మాణాన్ని చేపడుతున్నట్లు కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు వెల్లడించారు. శనివారం స్థానిక టిడ్కో గృహాల వద్ద నూతన వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులకు ఆయన లాంఛనంగా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, నివాసితులకు నిరంతరాయంగా రక్షిత మంచినీటిని అందించేందుకు నిల్వ సామర్థ్యాన్ని పెంచుతున్నట్లు తెలిపారు. గతంలో 4,600 ఇళ్ల నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించగా, పలు కారణాలతో ఆగిపోయిన పనులను ప్రస్తుతం ప్రభుత్వం వేగవంతం చేసిందని చెప్పారు. అసంపూర్తిగా ఉన్న ఇళ్లను పూర్తి చేయడంతో పాటు, ఆ ప్రాంతంలో దశలవారీగా పార్కులు, ఉన్నత పాఠశాల, ఆసుపత్రి వంటి అన్ని మౌలిక వసతులను కల్పిస్తామని హామీ ఇచ్చారు. టిడ్కో డీఈ గంగరాజు మాట్లాడుతూ, ఎమ్మెల్యే సూచనల మేరకు సంబంధిత శాఖల సమన్వయంతో పనులు ప్రారంభించామని తెలిపారు. ఎక్కడా నాణ్యతా లోపాలు లేకుండా, సాంకేతిక నిబంధనలకు అనుగుణంగా పనులను వేగంగా పూర్తి చేసి త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తెస్తామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు తుమ్మల రమేష్, బచ్చు శేఖర్, కసింకోట చంద్రశేఖర్, తుమ్మల సునీత, సుందరపల్లి గోపాలకృష్ణ, తుమ్మల కొండలరావు, మోసా పేతురు, గంపల లక్ష్మణరావు, దిబ్బాడ్ పొలరాజు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయులు వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

**ఎఫ్ ఏ 2 పరీక్షలకు విద్యార్థులు సన్నద్ధం చేయండి**

